# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు రాష్ట్ర మంత్రివర్గం సమావేశమయ్యింది.
- ❖ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని సమాచార, ప్రజా సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి వెల్లడించారు.
- ❖ ఫైబర్ నెట్ కనెక్షన్లను రానున్న 2 సంవత్సరాల్లో 50 లక్షలకు పెంచుతామని ఎపి ఫైబర్ నెట్ సంస్థ ఛైర్మన్ జీవీ రెడ్డి తెలిపారు.
- ❖ విశాఖపట్నంలో జనవరి 4వ తేదీన మరో దఫా నేవీ డే విన్యాసాలు జరగనున్నాయి.
- ❖ నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రేపు రాష్ట్రంలోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ రోజు మంత్రివర్గం సమావేశం జరిగింది. అమరావతిలోని సచివాలయంలో 21 అంశాలపై చర్చించిన మంత్రిమండలి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. అందులో ప్రధానంగా "జల్ జీవన్ మిషన్"కు సంబంధించి పనులను పునరుద్దరించి నూతన టెండర్లను పిలిచేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే అమరావతి రాజధానిలో మొత్తం 20 ఇంజినీరింగ్ పనులకు 8,821 కోట్ల రూపాయల పరిపాలన అనుమతులకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అమరావతి అభివృద్ధికి హడ్కో నుంచి 11 వేల కోట్ల రూపాయల కేఎఫ్ డబ్ల్యు నుంచి 16 వేల కోట్ల రూపాయల రుణం తీసుకోవడానికి అంగీకారం తెలిపింది.

========================

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని సమాచార, పౌరసంబందాల శాఖా మంత్రి కొలుసు పార్ధసారధి తెలిపారు. మంత్రి వర్గ సమావేశం అనంతరం ఈరోజు ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... 475 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఈ నెల నుంచే దీనిని అమలు చేస్తామన్నారు. ప్రభుత్వ కళాశాలలు, కేజీబీవీ మోడల్ పాఠశాలలు, ఏపీ రెసిడెన్షియల్ కళాశాలల్లో చదివే ఇంటర్

విద్యార్థులకు "సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర" పథకం కింద పాఠ్యపుస్తకాలు, పోటీ పరీక్షల మెటీరియల్, పుస్తకాలు, ప్రాక్టికల్ రికార్డులను అందించడం కోసం కోసం 32 కోట్ల 45 లక్షల 88 వేల 679 రూపాయలు మంజూరు చేసేందుకు క్యాబినెట్ అంగీకారం తెలిపిందన్నారు. కళాశాలల్లో డ్రాపవుట్స్ ను తగ్గించేందుకు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని మంత్రి పార్థసారధి వివరిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

========================

రాష్ట్రంలో ఫైబర్ నెట్ కనెక్షన్లను రానున్న 2 సంవత్సరాల్లో 50 లక్షలకు పెంచుతామని ఎపి ఫైబర్ నెట్ సంస్థ ఛైర్మన్ జీవీ రెడ్డి తెలిపారు. ఇంటర్నెట్ కేబుల్ సర్వీసులను ప్రజలకు తక్కువ ధరకే అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2014 లో ఎపి ఫైబర్ నెట్ ను ప్రారంభించారని.. ఇది సర్వీస్ ప్రొవైడర్ కేబుల్ నెట్ వర్క్ అని పేర్కొన్నారు. విజయవాడలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఫైబర్ నెట్ వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇంటర్నెట్ నెట్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. 2019 నాటికి 10 లక్షల కనెక్షన్లు ఉండగా.. 2024 నాటికి కేవలం 5 లక్షలకు తగ్గిపోయాయన్నారు. కేబుల్ ఆపరేటర్ లతో సమావేశాలు నిర్వహించి ఫైబర్ నెట్ ను మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

========================

విశాఖపట్నంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 04న జరిగే నేవీ డే విన్యాసాలు ఈ సంవత్సరం ఒడిసాలోని పూరీలో నిర్వహించారు. అయితే జనవరి 4 వ తేదీన  మరో దఫా విన్యాసాలు విశాఖలో నిర్వచనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ కలెక్టరేట్ లో ఈరోజు నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.... ఈ వేడుకల్లో నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారని తెలిపారు. ఇందుకోసం ప్రధాన వేదిక సమీపంలో గ్రీన్ రూమ్ ఏర్పాటు చేయాలని, ఎలాంటి ఇబ్బందీ రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈ విన్యాసాల్లో భాగంగా ఆర్.కె. బీచ్ లో ఓపీ డెమో, లేజర్ షో, డ్రోన్ షో, నౌకల విన్యాసాలు కూడా ఉంటాయని నేవీ అధికారులు పేర్కొన్నారు. జనవరి 02వ తేదీన పూర్తి రిహార్సల్స్ జరుగుతాయని వెల్లడించారు.

========================

రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఈ రోజు సచివాలయంలో ఎల్ ఓ సి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 10 లక్షల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా  మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో విద్యా, వైద్యనికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు.

విరామం

========================

విజయనగరం జిల్లాను క్షయ వ్యాధి రహితంగా మార్చడమే తమ లక్ష్యమని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేర్కొన్నారు. ఈ రోజు దృశ్య మాధ్యమం ద్వారా అధికారులతో జాతీయ స్థాయిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా 10 వాహనాల ద్వారా టిబి పరీక్షలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 779 టిబి క్యాంపులను నిర్వహించమని వెల్లడించారు. అలాగే టిబి వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను కూడా అందజేస్తున్నామన్నారు. ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన టిబి ప్రచార కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు.

========================

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ఈరోజు పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమయి వుందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. దీనికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని దీని ప్రభావంతో రాష్ట్రంలో పలు చోట్ల రేపు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి తెలియజేస్తూ....

(వాయిస్ 15 సెకన్లు)

అలాగే శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో ఆదివారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్ళరాదని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

========================

అల్పపీడన ప్రభావంతో శ్రీకాకుళం జిల్లాలో వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించామని జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కె.త్రినాథ స్వామి అన్నారు. ఈరోజు పొందూరు మండలం కింతలి గ్రామంలో కోత కోసిన వరి పంటను పరిశీలించారు.

========================

"ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన" పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు జిల్లా విద్యుత్ శాఖ ఎస్.ఈ. ఇస్మాయిల్ అహ్మద్ కోరారు. తద్వారా విద్యుత్ ను ఆదా చేయవచ్చునన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా చిత్తూరు విద్యుత్ శాఖ ఉద్యోగులు, ఈరోజు ర్యాలీ నిర్వహించారు. "విద్యుత్ పొదుపు పాటిద్దాం, భావితరాలకు అందిద్దాం.. నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించారు.

========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

========================

ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో తప్పిదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తపడాలని రాష్ట్ర ఎన్నికల జాబితా పరిశీలకులు, ప్రవీణ్ కుమార్ అధికారులకు సూచించారు. ఈరోజు విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై.. ఓటరు జాబితా సంక్షిప్త సవరణ - 2025 ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్థానికంగా ఉన్న జనాభాకు, ఓటర్లకు మధ్యనున్న వ్యత్యాసానికి అనుగుణంగా చర్యలు చేపట్టాలని ఆదేశించి పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు.

========================

========================